'బండ్లగూడను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాం'

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏకగ్రీవంగా ఆమోదించారు. మొత్తం 51.11 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని నిధులను మంజూరు చేయించి పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, పద్మావతిపాండు, సంతోషిరాజిరెడ్డి, శ్రవంతి నరేందర్, అనితవెంకటేష్, మాలతీనాగరాజు, భూపాల్‌గౌడ్, నిఖిలసంగారెడ్డి, పుష్పశ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, ముద్దం రాము, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ అధికారులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

కల్యాణం.. కమనీయం


పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందా మాంబా కల్యాణ మహోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందా మాంబా కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పచ్చని కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు భక్తి గీతాలను ఆలపించారు. కల్యాణ మహోత్సవం అనంతరం స్థానిక మహిళలు ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్ని అన్నదానాన్ని స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణ

రాజేంద్రనగర్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజేంద్రనగర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు డి.సత్యనారాయణ ముదిరాజ్ నియమితులయ్యారు. సోమవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ తన కార్యాలయంలో సత్యనారాయణ ముదిరాజ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ముదిరాజ్ రాజేంద్రనగర్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి నాయకుడున్ని, కార్యకర్తలను బీజేపీ తగిన సమయంలో ప్రోత్సహించి ఉన్నత పదవులను అందజేస్తుందన్నారు. వరుసగా మూడుసార్లు రాష్ట్ర కార్యవర్గంలో తనకు చోటు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న సత్యనారాయణముదిరాజ్

శంషాబాద్‌లో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం

శంషాబాద్: బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను దగా చేస్తోందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ ఆరోపించారు. నిరుద్యోగ యువత కోసం పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులపై ప్రభుత్వ దాడులకు నిరసనగా ధర్నా చేపట్టి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శంషాబాద్ పట్టణంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హామీలన్ని చెత్తబుట్టలో వేశారన్నారు. ఎనిమిది నెలలు గడిచిపోయినా ఇంతవరకు జాబ్ కేలెండర్ పత్తాలేదన్నారు. మెగా డీఎస్సీ అంటు ప్రగల్భాలు చెప్పినా ముఖ్యమంత్రి గత పోస్టులకు కొన్నింటిని మాత్రమే అదనంగా చేర్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల టీచర్ పోస్టులను మెగా డీఎస్సీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ 1:100 నిష్పత్తి ప్రకారం క్వాలిఫై చేయాలన్నారు. గ్రూప్ 2, 3లో కూడా అదనపు పోస్టులు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు వంశీయాదవ్, బుక్క ప్రవీణ్, శ్రీనుయాద్, సిద్దు, ప్రదీప్, నర్సింగ్, సాయి, ప్రకాష్, ప్రశాంత్, సురేష్, మహేష్, ఆనంద్, వీరేందర్, శ్రీకాంత్, హరీష్ , వినయ్ పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి


జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడుతుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సర్కిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్‌లైట్లు వంటి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని అనేక కాలనీల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయని వాటి పరిష్కారం తొందరగా చేయాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని సర్కిల్ అధికారులను కోరారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లైట్లు వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. కొన్ని కాలనీల్లో నూతనంగా సీసీ రోడ్లు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ ఈఈ నరేందర్‌గౌడ్, డీఈ మధుసూధన్‌రెడ్డి, ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, హరీష్, విద్యుత్ స్ట్రీట్ లైట్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, శ్రీకాంత్, మహేందర్, రవీందర్ ఉన్నారు.

ఫోర్జరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

రాజేంద్రనగర్: ఫోర్జరీ కేసులో రాజేంద్రనగర్ 11వ అదనపు జడ్జి ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ ప్రాంతంలో నిఖత్ ఆరా అనే మహిళకు 200 గజాల ప్లాట్ ఉంది. ఈ ప్లాట్‌ను నాంపల్లికి చెందిన నిఖత్ ఆరా భర్త హఫీజ్, బావ యూసుఫ్ ఫోర్జరీ సంతకాలతో విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న నిఖత్ ఆరా కోర్టు రిఫర్ ద్వారా కేసు నమోదు చేయించింది. 2011 నుంచి ఈ కేసు కొనసాగుతోంది. సోమవారం 11వ అదనపు న్యాయమూర్తి నీలిమా తుదితీర్పు వెల్లడించారు. ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

శంషాబాద్: బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన బాబాయిని ఆర్‌జీఐఏ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...బతుకుదెరువు కోసం వచ్చిన భార్యాభర్తలు కూతురు(14)తో కలిసి శంషాబాద్ పట్టణంలోని కాపుగడ్డలో నివాసముంటున్నారు. అయితే రెండు నెలల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నెల 20న తల్లి పని నిమిత్తం బయటికి వెళ్లడంతో ఇంట్లోనే ఉన్న బాలికపై సొంత చిన్నాన్న అయిన పోతురాజు యాకేష్(35) అత్యాచారం జరిపాడు. విషయం తల్లికి తెలియడంతో మరుసటి రోజు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

భయం.. భయం

ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లు • వేలాడుతున్న విద్యుత్ వైర్లు • భయాందోళనలో ప్రజలు

శేరిలింగంపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి పలుచోట్ల ఫెన్సింగ్ లేకపోవడంతో బాటు వైర్లు కిందకి వేలాడుతుండడంతో ఎపుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, సాధారణ ఇళ్ల నిర్మాణం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో పెరగడంతో అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఉన్న వాటి సామర్థ్యం పెంచడం చేస్తున్నారు. కాగా ఉన్నవాటికే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసే ఈ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రత్యేకంగా కంచె ఏర్పాటు చేయకపోవడం.. పరిసరాల్లో నివాసముండేవారు నిత్యం భయాందోళనకు గురి కావాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రతి కాలనీ, బస్తీలో మూడు నుంచి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇక అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తుండడంతో వీటి సంఖ్య పెరుగుతూ పోతోంది. శేరిలింగంపల్లిలోని పలు కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ వైర్లు యమపాశాల్లా వేలాడుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతోఆయా కాలనీల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- శేరిలింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ, నల్లగండ్ల మార్కెట్, లింగంపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా, గుల్‌మొహర్‌పార్కు చౌరస్తా, బాపూనగర్, డోయన్స్ టౌన్‌షిప్, సుదర్శన్‌నగర్-ఆలిండ్ హౌసింగ్ సొసైటీ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.
- ట్రాన్స్‌ఫార్మర్లను పిల్లర్‌పై ఏర్పాటు చేసినా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండటం స్థానికులను కలవరపరుస్తోంది. ఈ వైర్ల వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురవుతారని ఆందోళన చెందుతున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూరా వ్యర్థాలు, పిచ్చి మొక్కలు ఉండడంతో మూగజీవాలు అక్కడ తచ్చాడుతున్నాయని అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను నిర్మిస్తే ప్రమాదాలను చాలావరకు అరికట్టవచ్చని కాలనీ, బస్తీవాసులు అభిప్రాయపడుతున్నారు.
- అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోకపోవడంతో నిత్యం భయపడాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు.


శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు


గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తాలో ..



లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫారం వైపు రోడ్డుపై ఉన్న కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌లు


నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ప్రహరీ పక్కన..

సెలూన్ షాప్ నిర్వాహకుడిపై దాడి

మైలార్‌దేవ్‌పల్లి: గంజాయి మత్తులో ముగ్గురు యువకులు సెలూన్ షాప్ నిర్వాహకుడిపై దాడి చేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శాస్త్రీపురం డివిజన్ పరిధిలోని దానమ్మ జోపిడి ఇడ్లీ హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి ఓ హెయిల్ సెలూన్ షాపులో ముగ్గురు స్థానికంగా ఉన్న యువకులు సర్వర్, హయాన్, నదీమ్ గంజాయి సేవించి హెయిర్ సెలూన్ యజమానిపై పిడిగుద్దులతో రెచ్చిపోయారు. అడ్డు వచ్చిన వారిపై దాడికి దిగారు. షాపు అద్దాలను ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చే సరికి అక్కడి నుంచి పారిపోయారు. యువకులు గంజాయి మత్తులో హంగామ సృష్టిస్తున్నారని, కాలనీలో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక మహిళలు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కిరాణ షాపు దగ్ధం

– సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం



మైలార్‌దేవ్‌పల్లి: విద్యుదాఘాతంతో కిరాణా షాపు దగ్ధమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అశిష్ అగర్వాల్ తన కుటుంబంతో కలిసి కొన్ని సంవత్సరాల క్రితం కాటేదాన్ ప్రాంతానికి వలస వచ్చారు. టీఎన్జీవోస్ కాలనీలోని ప్రధాన రహదారిలో రెండేళ్ల క్రితం శాకుంబరీ మాత కిరాణా జనరల్ స్టోర్‌ను ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నాడు. ఆదివారం యధావిధిగా రాత్రి 10 గంటల ప్రాంతంలో షాపు మూసి లక్ష్మీగూడలో తన ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం 5.30గంటల ప్రాంతంలో షట్టర్ నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు షాపు యజమానికి ఫోన్ ద్వారా తెలిపారు. యజమాని షాపు షట్టర్ తీసి చూడగా అందులోని కిరణా సామను అంతా దగ్ధం అయ్యింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం అయ్యిందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జలమండలి రాజేంద్రనగర్ జీఎంగా సాయిలక్ష్మి

రాజేంద్రనగర్: జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజర్‌గా ఎన్.సాయిలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ జీఎంగా పని చేసిన శ్యాంసుందర్ సైదాబాద్ డివిజన్ జీఎంగా బదిలీ అయ్యారు. సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన జీఎం సాయిలక్ష్మికి డిప్యూటీ జనరల్ మేనేజర్ జమీల్ అల్తాఫ్ హుస్సేన్, మేనేజర్లు నరసింహారెడ్డి, ఖాదర్, శ్రావ్య రెడ్డి, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిలక్ష్మి మాట్లాడుతూ..స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మంచినీటి సరఫరాలో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జమీల్ అల్తాఫ్ హుస్సేన్, నరసింహారెడ్డి

డిజిటలైజేషన్ దిశగా విద్యుత్ శాఖ


మణికొండలో డిజిటలైజేషన్ పనులను పరిశీలిస్తున్న డీఈ శివశంకర్

మణికొండ: విద్యుత్ సరఫరాను మరింత మెరుగు పరచి, ప్రజలకు మరింత మెరుగైన అత్యాధునిక సమాచారం అందించే దిశగా ప్రతి విద్యుత్ స్తంభం సమాచారాన్ని డిజిటలైజేషన్ చేస్తున్నామని ఇబ్రహింబాగ్ విద్యుత్ డివిజన్ ఇంజినీర్ ఎం.శివశంకర్ అన్నారు. విద్యుత్ శాఖ రాష్ట్ర ఎండీ ముషారఫ్ ఆదేశాలతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పనులను సోమవారం ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించి ప్రతి సమాచారం డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. ఈ సర్వేలో భాగంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, లైన్ల పనితీరు, వైర్ల నాణ్యతలను పరిశీలించి అవి సరిగా లేకపోతే వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించటానికి డిజిటలైజేషన్ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యుత్ స్తంభానికి కోడ్‌లను వేయటంతో ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వాటిని నిమిషాల వ్యవధిలో గుర్తించే అవకాశం కలుగుతుందన్నారు. డివిజన్ పరిధిలో 16 బృందాలు టీజీఏఐఎంఎస్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఫ్రెండ్స్ కాలనీ, లాలమ్మ గార్డన్స్ కాలనీలో నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ జ్ఞానేశ్వర్, సబ్ ఇంజినీర్ చెన్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

మణికొండ: జిల్లాలో ఉండాల్సిన క్యాడర్ కంటే అధికంగా ఇతర జిల్లాల నుంచి ఉపాధ్యాయులు వచ్చారని వారిని వెంటనే వెనక్కి పంపే చర్యలు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు ఈ విషయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రమోషన్‌లు, బదిలీలలో జిల్లాలో ఎంతో కాలంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ వారికి ముందుకు ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రామేశ్వరి, టీఆర్‌టీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కుషాల్, పీఆర్‌టీయు గౌరవ అధ్యక్షుడు కిరణ్, ఉపాధ్యాయులు జగదాంబ, సుభద్రాదేవి, నీరజ, రాజేశ్వరి, శ్యాంసుందర్‌రెడ్డి, పద్మ, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.


నార్సింగిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జిల్లాలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

శంషాబాద్: రాష్ట్రంలో ఇతర జిల్లాల మాదిరిగానే రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు అడ్డుగా మారిన సాంకేతిక, న్యాయపరమైన సమస్యలన సత్వరమే పరిష్కరించాలన్నారు. బదిలీల ప్రక్రియ లేకపోవడంతో జిల్లాలోని ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా వీరేందర్‌రెడ్డి


నియామకపత్రాన్ని తీసుకుంటున్న వీరేందర్‌రెడ్డి

శంషాబాద్: బీజేవైఎం శంషాబాద్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడిగా డి.వీరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు వంశీయాదవ్, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు దేవేందర్ చేతుల మీదుగా సోమవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్టీ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో యువమోర్చా పాత్ర ఎంతో కీలకమైందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి బీజేపీ, బీజేవైఎం నేతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ సిద్దు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, యువనాయకులు గాజుల రాహుల్, శ్రీకాంత్, సాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

అధికారిక భాష హిందీపై ఒకరోజు వర్క్‌షాప్


ఐఐఎంఆర్‌లో హిందీపై జరిగిన వర్క్‌షాప్‌లో అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్‌లో సోమవారం అధికారిక భాష హిందీపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తారాసత్యవతి మాట్లాడుతు మా సంస్థలో అధికారిక భాష అమలు సజావుగా సాగుతోందని, అధికారిక భాష అమలును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఇలాంటి వర్క్‌షాపులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఐఐఎంఆర్ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా అధికారిక భాషను తప్పనిసరిగా వినియోగిస్తామన్నారు. హిందీ దాని ప్రయోజనాల గురించి వివరించారు. సెంట్రల్ హిందీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జె.శంకర్ ప్రసాద్ తీవారి, భారత ప్రభుత్వ రిసోర్స్‌పర్సన్ జీను జాకబ్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రీతూ దలాల్, డాక్టర్ మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తానీషానగర్ కాలనీ కమిటీ ఎన్నిక



మణికొండ: తానీషానగర్ (హుడాకాలనీ) సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌బీ.రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ వాహిద్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా బీడీ ఈరన్న, సంయుక్త కార్యదర్శిగా ఎం.కష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.రంగారెడ్డి, పీఎస్ఎన్ మూర్తి, కోశాధికారిగా కె. వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గసభ్యులుగా జి.లింగంగౌడ్, జి.హ్రజితాయ, ఎం, సుగునరాజు, టీవీ.రాంమోహన్‌రెడ్డి, వి.వెంకటరమణరెడ్డి, షకీబ్ హుసేన్, సీవీఎస్ రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రాబోయే రెండు సంవత్సరాల కాలం పనిచేస్తుందని అధ్యక్షుడు తెలిపారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి శక్తి వంతన లేకుండా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

హిమాయత్‌సాగర్‌లో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేయాలి

బండ్లగూడ: ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు హిమాయత్‌నగర్‌లో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. హిమాయత్‌సగర్ జలాశయం నుంచి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఫిల్టర్ బెడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నీటి సరఫరా చేస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. ఇదే విషయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి వివరించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడారని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.

'ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం'

రాజేంద్రనగర్: 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ సూచించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులతో ఆయన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ఐదు ఫిర్యాదులు అందాయన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి మూడు, రోడ్లకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు వెల్లడించారు. అధికారులు, సిబ్బంది ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తారని వెల్లడించారు. తమ ప్రాంతంలోని సమస్యల పరిష్కారానికి ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సర్కిల్ ప్రజలను కోరారు.